# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 28-08-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

-  రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ కార్డు అందించేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు.

-  కోస్తాంధ్రకు భారీ వర్ష సూచన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్య ప్రసాద్ ఆదేశించారు.

-  ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు విశాఖపట్టణంలో పర్యటించనున్నారు.

-  ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 125వ సంచిక ఈ ఆదివారం ప్రసారమవుతుంది.

==================

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ కార్డు అందించేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఫ్యామిలీ బెనిఫిట్ కార్డ్ పై ముఖ్యమంత్రి ఈరోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న పథకాలు సహా అన్ని వివరాలను ఫ్యామిలీ కార్డులో పొందుపరచాలని అధికారులకు సూచించారు. ఆధార్ తరహాలో ఫ్యామిలీ కార్డును ఉపయోగించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ సంక్షేమం అవసరమైన వారికి వెంటనే అందేలా వ్యవస్థను సిద్ధం చేయాలన్నారు. కార్డులోని వివరాలను ఎప్పటికప్పుడు అప్ డేట్ చేయాలన్నారు. త్వరలోనే పాపులేషన్ పాలసీ తీసుకురావాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆదేశించారు.

==================

కోస్తాంధ్రకు భారీ వర్ష సూచన నేపథ్యంలో రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్య ప్రసాద్ ఆదేశించారు. ఉపరితల అవర్తన ప్రభావంతో కోస్తాంధ్రకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేయడంతో అధికారులంతా సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలన్నారు. ఉత్తరాంధ్ర, ఏలూరు, ఉమ్మడి కృష్ణా జిల్లాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. ప్రకాశం బ్యారేజీ నుండి 3 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయడంతో కృష్ణానది పరివాహక ప్రాంత ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కోరారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు, ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. కోస్తాంధ్ర తీరంలో అల్పపీడనం నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. అయితే ప్రజలు ఆందోళన చెందవద్దని, ఎటువంటి విపత్తు అయినా ఎదుర్కొనేందుకు ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు.

==================

కేంద్ర ప్రభుత్వ సహకారంతో పోలవరం ప్రాజెక్టు పనులు వేగంగా జరుగుతున్నాయని త్వరలోనే అవి పూర్తవుతాయని రాష్ట్ర దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. నెల్లూరులో ఈరోజు ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రాయలసీమతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు కూడా సాగునీటిని అందించే లక్ష్యంతోనే బనకచర్ల ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం తీసుకువస్తోందన్నారు. సముద్రంలోకి వృథాగా పోయే కృష్ణ, గోదావరి నదుల నీటిని సద్వినియోగం చేసుకునే

లక్ష్యంతోనే ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. హంద్రీనీవా సుజల స్రవంతి ద్వారా కుప్పం నియోజకవర్గానికి ఈనెల 30న ముఖ్యమంత్రి నీటిని విడుదల చేస్తారని చెప్పారు. ప్రభుత్వం అనుసరిస్తున్న సమగ్ర నీటి యాజమాన్యం వల్లే ఇదంతా సాధ్యమవుతోందని మంత్రి వెల్లడించారు.

===================

ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ పంపిణీలో రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలలో రాయచోటి 10వ స్థానంలో ఉందని రవాణాశాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో మంత్రి ఈరోజు లబ్దిదారులకు 71 లక్షల రూపాయలు విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ అనేది ఒక మహోన్నతమైన కార్యక్రమం అని, ఇప్పటికే సుమారు 3 కోట్ల 90 లక్షల రూపాయలు నిధులను రాయచోటి నియోజకవర్గంలోని ప్రజలకు అందజేశామన్నారు. ఎందరో పేద ప్రజలకు ప్రాణదాతలుగా నిలిచిన ముఖ్యమంత్రికి రాయచోటి ప్రాంత ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని మంత్రి మాట్లాడుతూ..

(వాయిస్ బైట్...30 సెకన్లు)

===================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు విశాఖపట్టణంలో పర్యటించనున్నారని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ ఈరోజు సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రేపు ఉదయం 11.15 నిమిషాలకు కోస్టల్ బ్యాటరీకి ముఖ్యమంత్రి చేరుకుంటారని, నోవటెల్, రాడిషన్ బ్లూ రిసా ర్ట్స్‌లో జరిగే కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారని తెలిపారు. హెలిప్యాడ్ వద్ద ఎటువంటి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. నోవాటెల్ హోటళ్లో జరిగే ఫుడ్ మానుఫ్యాక్చరింగ్ సమ్మిట్ లో ముఖ్యమంత్రి భాగస్వామ్యం అవుతారని, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, ట్రేడ్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రతినిధులతో సమన్వయం చేసుకొని పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే రాడిషన్ బ్లూ రిసార్ట్స్ వద్ద జరిగే గ్రిఫిన్ ఫౌండర్ నెట్ వర్కింగ్ కార్యక్రమానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలన్నారు.

===================

విరామం

===================

ప్రధానమంత్రి జన్ ధన్ యోజన ఈరోజుతో 11 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. బ్యాంకింగ్ సేవలను సులభతరం చేయడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంచడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. దీనిని ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2014 ఆగస్టు 28న ప్రారంభించారు. ఇది దేశంలోని అన్ని కుటుంబాలకు సమగ్ర ఆర్థిక సమ్మిళితాన్ని, బ్యాంకింగ్ సేవలను అందించేందుకు దోహదపడుతోంది. ఈ పథకం ప్రాథమిక పొదుపు బ్యాంకు ఖాతా లభ్యత, ఋణాలు, చెల్లింపుల సౌకర్యం, భీమా, పింఛన్ వంటి అనేక రకాల ఆర్థిక సేవలను సులభంగా అందిస్తోంది. జన్‌ధన్ ఖాతాలను కనీస మొత్తం డిపాజిట్ లేకుండానే నిర్వహించుకోవచ్చు. ఈ సంవత్సరం మార్చి 7 నాటికి మొత్తం జన్-ధన్ ఖాతాల సంఖ్య 55.02 కోట్లకు చేరుకోగా, వాటిలో 36.63 కోట్ల ఖాతాలు.. గ్రామీణ ప్రాంతాలు, చిన్న పట్టణాల్లోనే తెరవబడ్డాయి.

===================

రాష్ట్రంలోని క్రీడాకారులకు ప్రభుత్వం 4కోట్ల 90లక్షల రూపాయల క్రీడా ప్రోత్సాహకాలను విడుదల చేసిందని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్ )ఛైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. ఈరోజు అమరావతిలో పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ, ఈ ప్రోత్సాహకాలతో రాష్ట్రంలోని 43మంది అంతర్జాతీయ క్రీడాకారులకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఈ ప్రోత్సాహకాల పట్ల రాష్ట్ర వ్యాప్తంగా క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. విశాఖలోని వీఎంఆర్‌డీఏతో కలిసి క్రీడా సౌకర్యాలు కల్పిస్తున్నామని, అలాగే వెయిట్ లిఫ్టింగ్ అకాడమీ కూడా ఏర్పాటు చేయాలని యోచిస్తున్నామని వెల్లడించారు. 2029 జాతీయ క్రీడలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆతిథ్యం ఇచ్చేలా వేలంలో పాల్గొంటామని, 2027లో పారా అథ్లెట్ పోటీలకు విశాఖ ఆతిథ్యమిచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు.

===================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 125వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్

కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు రేపు సాయంత్రం వరకు పంపవచ్చు.

===================

దక్షిణ ఒడిశా మీదుగా ఉన్న అల్పపీడనం ఈరోజు ఛత్తీస్ గఢ్ దాని పరిసర ప్రాంతాలలో కొనసాగుతోందని, దీని అనుబంధ ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టానికి 5.8కి.మీ ఎత్తువరకు విస్తరించి నైరుతి వైపుకు వంగి ఉందని అమరావతి లోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రేపటి వర్ష సూచనలను వాతావరణ ప్రధాన అధికారిణి స్టెల్లా వెల్లడిస్తూ..

(వాయిస్ బైట్...32 సెకన్లు)

===================

శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలో కొలువైన కొత్తమ్మతల్లి జాతరను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దేవదాయ శాఖ అధికారులను ఆదేశించారు. వచ్చే నెల 23 నుంచి 25 వరకు జరుగనున్న పండుగ మహోత్సవం నేపథ్యంలో ఈరోజు నిమ్మాడలోని ఆయన కార్యాలయంలో జాతర ఏర్పాట్లపై మానిటరీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఉచిత దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు.

===================
===================